## క్లుప్తంగా

### బాల్యం అమూల్యమైనది



విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

**ఇబ్రహీంపట్నం రూరల్:** 'బాల్యం అమూల్యమైనది. విద్యార్థి దశ నుంచే దేశభక్తి, దేశ సమగ్రత పట్ల అంకితభావంతో మెలగాలి. నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి' అని ప్రధానోపాధ్యాయుడు వర్కాల పరమేష్ అన్నారు. సోమవారం ఆదిబట్ల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ఉపాధ్యాయులుగా తోటి వారికి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మాణం అవుతుందని తెలిపారు. బాల బాలికలకు పూర్తి స్వేచ్ఛనిచ్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీదేవి, భాషయ్య, రజిత పాల్గొన్నారు.

### ఘనంగా కార్తీకమాస పూజలు



భజనలు చేస్తున్న భజన మండలి సభ్యులు

**ఆమనగల్లు:** కార్తీకమాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణంలోని హనుమాన్ దేవాలయంలో అభయాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిరంతరం భజనలు చేస్తున్నారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు నారాయణగౌడ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి బుచ్చిరాములు, గౌరవాధ్యక్షుడు దామోదరాచారి, సభ్యులు కృష్ణమాచారి, పార్థసారధి, మామిడిశెట్టి గోపాల్, భాస్కరాచారి, శ్రీశైలం, ముక్కరి కృష్ణయ్య, మనోహర్, రఘు, ఆంజనేయులు, ఆలయ పూజారి రామకృష్ణశర్మ తదితరులు ఉన్నారు.

### పాఠశాలల తనిఖీ

**ఆమనగల్లు:** పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలలను సోమవారం ఎంఈఓ పాండు తనిఖీ చేశారు. విద్యార్థుల వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలల యాజమాన్యాలు చిన్నారులను అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. పాఠశాల ఆవరణ, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న రిషి టాలెంట్ స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు అందజేశారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ జయశ్రీ

**అబ్దుల్లాపూర్‌మెట్:** పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధి 7వ వార్డులో కౌన్సిలర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రూ.9 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులకు సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ జయశ్రీ శంకుస్థాపన చేశారు. కమిషనర్ రవీందర్‌రెడ్డి, డీఈఈ శివానంద్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, విద్య, అనురాధ, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఖలీల్ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**తలకొండపల్లి:** రైతులు తమ దిగుబడిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ఏడీఏ ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీనివాస మురుగన్ సీసీఐ సెంటర్, సింగిల్‌విండో ఆధ్వర్యంలో కొనసాగుతున్న తలకొండపల్లి, పడకల్ కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. తేమ 17 శాతం లోపు, తాలు లేకుండా వరిని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు సూచించారు. ఏఓ రేణుక చక్రవర్తి, ఏఈఓలు లలిత, త్రిలోకియా ఉన్నారు.

### కార్మికుల సమస్యలు పరిష్కరించండి

**మంచాల:** కార్మికులు, రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ వెంకట ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న నల్ల చట్టాలు కార్మిక లోకానికి నష్టం కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఆ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు.

# సమాచారం నిక్షిప్తం

కులగణన తుది దశకు చేరుకుంది. సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే వివరాలు కంప్యూటర్‌లో నిక్షిప్తం అవుతున్నాయి. ఇప్పటి వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికి తిరిగి రాసుకున్న వివరాలను మండల పరిషత్ తదితర కార్యాలయాల్లో ఏర్పాటు కేంద్రాల్లో ఆపరేటర్లు ఆన్‌లైన్లో పొందుపరుస్తుండగా.. ప్రక్రియను ఎంపీడీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు.

- ఆన్‌లైన్‌లో వివరాల నమోదు
- పర్యవేక్షిస్తున్న అధికారులు
- గడువులోగా మిగతా సర్వే పూర్తి
- అధికారుల వెల్లడి



అబ్దుల్లాపూర్‌మెట్: సర్వే డేటాను ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్లు

**అబ్దుల్లాపూర్‌మెట్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ) సర్వే అబ్దుల్లాపూర్ మెట్ మండలంలో 95 శాతం పూర్తయిందని ఎంపీడీఓ శ్రీవాణి తెలిపారు. సర్వేలో మిగిలి పోయిన కుటుంబాలు ఉంటే.. మండల పరిషత్ అధికారి ఫోన్ నంబర్ 8317679293ను సంప్రదించాలని సూచించారు. ఇప్పటి వరకు సేకరించిన వివరాలను మండల కేంద్రంలోని బ్రిలియంట్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఆన్‌లైన్ చేస్తున్నామని పేర్కొన్నారు. జీపీ కార్యదర్శుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ప్రజలు సహకరించాలి: కమిషనర్**

**ఆమనగల్లు:** సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ వసంత కోరారు. కులగణన చివరిదశకు చేరుకుందని, 93 శాతం పూర్తయిందని తెలిపారు. మున్సిపాలిటీలో 5,514 నివాసాలు ఉండగా.. 5,161 ఇళ్లల్లో వివరాలు సేకరించామని పేర్కొన్నారు. మిగతావి గడువులోగా ఎన్యుమరేటర్లు పూర్తి చేయనున్నారని వెల్లడించారు. సర్వే చేయించుకోని కుటుంబాలు ఉంటే.. ఫోన్ నంబర్ 9912294158లో సంప్రదించాలని సూచించారు.

**తలకొండపల్లిలో..**

**తలకొండపల్లి:** సర్వే ప్రక్రియ మండల పరిధి వెంకట్రావ్‌పేట్, చంద్రధన, జూలపల్లి, తలకొండపల్లి, రాంపూర్, జంగారెడ్డి పల్లి, చుక్కాపూర్, ఖానాపూర్ తదితర గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోంది. 94 శాతం సర్వే పూర్తయిందని ఎంపీడీఓ శ్రీకాత్ చెప్పారు. సర్వేలో పాల్గొనని వారుంటే.. 26 సాయంత్రం వరకు కులగణన చేయించుకోవాలని సూచించారు. సందేహాలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 7032030507లో సంప్రదించాలని పేర్కొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మార్కెట్ కమిటీ పాలకవర్గానికి సన్మానం

**ఆమనగల్లు:** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం, అన్నదాతలకు, ప్రభుత్వానికి అనుసంధానంగా మార్కెట్ కమిటీ పాలకవర్గం పనిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకెళ్లాలని కోరారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన యాట గీత, పాలకవర్గం సభ్యులు ఎమ్మెల్యేను సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ గూడురి భాస్కర్‌రెడ్డి, సభ్యులను ఎమ్మెల్యే కసిరెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూడాలని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సభ్యులు శ్రీశైలం, పాండురంగయ్య, రవీందర్, రమేశ్‌గౌడ్, జంగయ్య, యాదయ్య, సంపత్‌కుమార్, నరేశ్‌నాయక్, అజీం, వెంకట్‌రెడ్డి, అంజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**చైర్‌పర్సన్‌కు సన్మానం**

**కడ్తాల్:** ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీతను మండల పరిధి మక్త మాధారం గ్రామంలో కెనరాబ్యాంకు సిబ్బంది, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రైతులకు అందుబాటులో ఉండి, వారి సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు మెనేజర్ సేవ్యానాయక్, సిబ్బంది జయరామ్, నయీం, రాఘవేందర్, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు బాలరాజు, నాయకులు చంద్రయ్య, శివకుమార్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, సభ్యులు

# ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడదాం

**కడ్తాల్:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పోరాడాలని సీఐటీయూ ఏరియా కమిటీ కన్వీనర్ పెంటయ్య పిలుపునిచ్చారు. అందులో భాగంగా ఈ నెల 26న జిల్లా కేంద్రంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి నిరసన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెంటయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, ఆర్థిక విధానాల వలన దేశ ప్రజలు, కార్మికులు, కర్షకులు అనేక కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నష్టపోతున్నారని పేర్కొన్నారు. అన్ని పంటలకు మద్దతు ధర, వ్యవసాయ ఖర్చులకు 50 శాతం అదనంగా జోడించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, పింఛన్ రూ.10 వేలు అందరికీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు రమేశ్, నాయకులు యాదయ్య, జంగయ్య, వెంకటయ్య, శ్రీను తదితరులు ఉన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**ఆమనగల్లు:** అభివృద్ధి పనుల ప్రారంభం నేపథ్యంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ నెల 26న మండల పరిధిలో పర్యటించనున్నారని ఎంపీడీఓ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. కోనాపూర్ గ్రామంలో ఈజీఎస్ ఆధ్వర్యంలో నిర్మించనున్న పశువుల షెడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేయనున్నారని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆమనగల్లు ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభిస్తారని వెల్లడించారు.

### రెసిడెన్షియల్ కాంప్లెక్స్ మంజూరుపై హర్షం

**తలకొండపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం నిర్మించతలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్ పాలిటెక్నిక్ కళాశాలను కల్వకుర్తి నియోజకవర్గానికి మంజూరు చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు యాదగిరి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. మండల పరిధి ఖానాపూర్ గ్రామ శివారు ప్రభుత్వ భూముల్లో కాంప్లెక్స్‌ను నిర్మించనున్నారని పేర్కొన్నారు. మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### టోర్నీ పరిశీలకుడిగా పరమేష్



**తలకొండపల్లి:** నాగర్‌కర్నూల్ జిల్లా రఘుపతి పేట ఉన్నత పాఠశాలలో ఈ నెల 27 నుంచి 29 వరకు జరగనున్న 68వ ఎస్‌జీఎఫ్ మల్లఖంబ రాష్ట్ర స్థాయి పోటీల పరిశీలకుడిగా వెల్జాల్ జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్(పీడీ) పరమేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ స్కూల్ గేమ్స్ ప్రధాన కార్యదర్శి శ్రీరాంరెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు పీడీ తెలిపారు.

### మండల కేంద్రంగా ప్రకటించాలి

**తలకొండపల్లి:** గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ వైస్ చైర్మన్ ఏదుల శరత్‌చంద్ర డిమాండ్ చేశారు. మండలానికి కావాల్సిన అన్ని అర్హతలు ఉన్నాయని తెలిపారు. గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన నిరాహార దీక్ష సోమవారానికి 25వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పోరాడుతున్నామని, ప్రజల ఆకాంక్ష మేరకు మండల కేంద్రంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గోవింద్, సాయమ్మ, జమున బాయ్, బాలయ్య, నరసింహ, రత్నయ్య, చెన్నయ్య, లింగమయ్య, ఈదమయ్య, గౌస్, ఎల్లోజీ, రాజు, అల్లావుద్దీన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి

**సీఐ ప్రమోద్ కుమార్**

**తలకొండపల్లి:** ఇటీవల కాలంలో కొందరు దుండగులు రాష్ట్రంలోని పలు దేవాలయాలను ధ్వంసం చేశారని, వీటిని దృష్టిలో పెటుకొని ఆలయాల వద్ద సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ ప్రమోద్ కుమార్ సూచించారు. కెమెరాలు ఉంటే దాడులు చేయడానికి భయపడతారని, ఒక వేల అలాంటి ఘటనలకు పాల్పడినా.. నిందితులను వెంటనే గుర్తించవచ్చని తెలిపారు. సోమవారం ఠాణాలో వివిధ మతాల పెద్దలు, పూజారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండల పరిధి ఆలయాల రక్షణకు ధర్మకర్తలు సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ఎస్ఐ శ్రీకాంత్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, హెడ్ కానిస్టేబుల్ హిమంత్ రావు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

# ప్రభుత్వ పథకాలపై కళాయాత్ర

**కడ్తాల్:** ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాలపై కళాయాత్ర కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్న సందర్భంగా నవంబర్ 19 నుంచి డిసెంబర్ 7వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన- ప్రజా విజయోత్సవాల యాత్ర సోమవారం మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గృహజ్యోతి, ఆర్టీసీ ఉచిత ప్రయాణం, మహాలక్ష్మి, రుణమాఫీ, ఇందిర మహిళాశక్తితో పాటు అభివృద్ధి కార్యక్రమాల గురించి తమ ఆటపాటల ద్వారా కళాకారులు వివరించారు. కార్యక్రమంలో టీం లీడర్ యాదయ్య, మోహన్‌రాజు, అపూర్వ, యాదమ్మ, నాయకులు రాజేశ్, భానుకిరణ్, రాఘవేందర్, బ్రహ్మచారి, నర్సింహ, శివలింగం, శ్రీకాంత్, వెంకటయ్య, శ్రీలత తదితరులు ఉన్నారు.



ప్రజాపాలన విజయోత్సవాలపై కళాకారుల ప్రదర్శన

# భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



మహాపడిని వెలిగిస్తున్న గురుస్వామి చందర్‌నాయర్

**అలరించిన భక్తిగీతాలు**

**యాచారం:** అయ్యప్పస్వామి నామస్మరణతో మండల కేంద్రం మార్మోగింది. బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొప్పు బాష గురుస్వామి 18వ మెట్టు మహాపడి పూజ సోమవారం నిర్వహించారు. గురుస్వాములు చందర్‌నాయర్, నారాయణశెట్టి, పురుషోత్తంల ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు చేపట్టారు. పూజకు వేలాది మంది మాలధారులు, సాధారణ భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, బీజేపీ జాతీయ నాయకులు మురళీధర్‌రావు, ఆచారి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహరెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్, రవీందర్‌రెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమం పట్టని సర్కార్

- ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం
- దిగుబడి దళారుల పాలు.. నష్టపోతున్న రైతులు
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**మంచాల:** రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యం వలన కర్షకులు నష్టపోతున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఆలస్యం వలన ధాన్యం దళారుల పాలవుతుందని, వరి కొనుగోళ్లలో వేగం పెంచి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఆరుట్లలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో దిగుబడిని విక్రయించినప్పటికీ.. సకాలంలో రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయడం లేదని విమర్శించారు. డీసీఎంఎస్, సివిల్ సప్లై, వ్యవసాయ శాఖ అధికారుల మధ్య కొరవడిన సమన్వయంతో రైతులు నష్టపోతున్నారని వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గ స్థాయిలో 2లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం 10 నుంచి 15 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయలేదని విమర్శించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. లేని పక్షంలో ధాన్యం దళారుల చేతుల్లోకి వెళ్లిపోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకట రమణారెడ్డి, ఎంపీపీ మాజీ సభ్యులు నర్మద, కృపేష్, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

**నేడు జిల్లా సన్నాహక సమావేశం**

ఈ నెల 26న బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ సన్నాహక సమావేశం జరగనుందని మంచిరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అలాగే 29న దీక్షా దివస్ ఉంటుందని తెలిపారు.

# ఇళ్ల మధ్య శ్మశాన వాటిక వద్దు

**తుర్కయంజాల్:** ఇళ్ల మధ్య శ్మశాన వాటిక ఏర్పాటు చేయవద్దని ప్రాంత ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని 22వ వార్డు లక్ష్మీనగర్, ఇందిరమ్మ కాలనీ, వేంకటేశ్వర కాలనీ, సాయిప్రియనగర్, సరస్వతి కాలనీల మధ్యలో శ్మశాన వాటిక ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానికేతరులు కొందరు కాలనీల మధ్య శ్మశాన వాటిక ఏర్పాటుకు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. దీనిపై తగిన విచారణ జరిపి న్యాయం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వేముల శంకర్, కానుగుల గిరి, మద్దెల కృష్ణ, ప్రవీణ్ కుమార్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

# విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**తుర్కయంజాల్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. పురపాలక పరిధి ఇంజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాలికల ఇంటర్ డిస్ట్రిక్ స్టేట్ లెవల్ కబడ్డీ పోటీలు నిర్వహించారు. టోర్నీలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా జట్టు నిలవగా.. రన్నరప్‌గా నల్లగొండ, మూడో స్థానంలో నిజామాబాద్ టీం నిలిచింది. ఈ సందర్భంగా విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య రంగారెడ్డి జట్టుకు రూ.20 వేలు, నల్లగొండ టీంనకు రూ.10వేలు అందజేశారు.

# భక్తుల కొంగుబంగారం రామలింగేశ్వరుడు

- ఏటేటా పెరుగుతున్న భక్తజనం
- ఆలయాన్ని అభివృద్ధి చేయాలి
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**మంచాల:** 'దక్షిణకాశిగా శ్రీ బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయం పేరుగాంచింది. భక్తుల కొంగు బంగారంగా విశ్వాసం పొందిన స్వామివారి సన్నిధికి ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధి ఆరుట్లలోని లింగేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. 25 ఏళ్ల క్రితం ఆలయానికి రావడానికి రోడ్డుమార్గం సరిగా ఉండేది కాదని పేర్కొన్నారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేగా నాటి ప్రజా ప్రతినిధుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేశామని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం రూ.కోట్ల నిధులు వెచ్చించి షెడ్ల నిర్మాణం, గుడి, సీసీరోడ్డు, బీటీరోడ్డు వేయించినట్లు వెల్లడించారు. ఏటా లక్షలాది మంది భక్తులు వచ్చే ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉందని, ఆ దిశగా దేవాదాయ శాఖ ప్రత్యేక దృష్టి సారించి, నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకట రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రమేష్, నియోజక వర్గ నాయకులు రమేష్‌గౌడ్, కృపేష్, రాంరెడ్డి, రవి, ఎంపీపీ మాజీ సభ్యులు నర్మద, ఇందిర, రాజు, జగదీష్, రాము, జానీ పాష, జంగయ్య, భద్రినాథ్, చిందం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ సమేతంగా కార్తీక దీపారాధన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

# ఐక్యత సేవలు అభినందనీయం

**ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్**

**ఆమనగల్లు:** ఐక్యత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు. ఫౌండేషన్ ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలో వారం రోజులుగా కొనసాగుతున్న మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పలువురికి సీఐ కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, అభినవ్ రెడ్డి, కొండల్‌యాదవ్, రమేశ్, మల్లయ్య, శేఖర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు అందజేస్తున్న సీఐ

# డిపో మేనేజర్‌కు వినతి

**మంచాల:** ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ వెళ్లే ఆర్టీసీ బస్సును మంచాల మండలం తిప్పాయిగూడ మీదుగా నడిపించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకట నర్సప్పకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంతకు ముందుగానే బస్సును తిప్పాలని పేర్కొన్నారు. దీనికి డీఎం సానుకూలంగా స్పందించారని, పరిశీలన అనంతరం సర్వీసును తిప్పుతామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో తిప్పాయి గూడ వాసులు యాదయ్య, సుధాకర్, కిష్టయ్య, రవి తదితరులు ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386